
epaper.manachourasta.com

# మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 21 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | బుధవారం, 17 డిసెంబర్ 2025 | పేజీలు : 04



నా పెళ్లిపై అసత్య ప్రచారం

## ఎందుకు

4



‘ఉపాధి’ని దెబ్బతీసేందుకు

# కేంద్రం కుట్ర

## మంత్రి పొన్నం ప్రభాకర్

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా విమర్శించారు. ఉపాధి హామీ చట్టం పేరు మార్చడం ద్వారా పథక ఆత్మను చంపే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి ఉరి తాడు పెడుతోందని అన్నారు. చట్టంలో మార్పులు గొప్పవైతే రాష్ట్ర ప్రభుత్వాలతో ఎందుకు చర్చించలేదని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో హడావిడిగా బిల్లులు ప్రవేశపెట్టడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వ్యాఖ్యానించారు. తక్షణమే ఉపాధి హామీకి సంబంధించిన బిల్లులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నిధుల్లో కోతలు విధిస్తూ కుంటి సాకులు చెబుతున్న కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు గాంధీ పేరును తొలగించి మహాత్మాగాంధీని అవమాన పరుస్తోందని మండిపడ్డారు. కరోనా సమయంలో దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం కోట్లాది మందికి ఉపాధి కల్పించిందని గుర్తు చేశారు. ఉపాధి హామీ చట్టం కాంగ్రెస్ పార్టీ బ్రెయిన్ చైల్డ్ కావడం వల్లే దానిని నిర్వీర్యం చేయాలనే కుట్ర జరుగుతోందని అన్నారు. నిఖిల్ దే, అరుణ్ రాయ్, హరగోపాల్, శాంత సిన్హా వంటి మేధావులతో చర్చించి ఈ చట్టాన్ని కాంగ్రెస్ తీసుకువచ్చిందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ విజయవంతంగా అమలవుతుంటే, పట్టణ పేదరికం నివారణకు ఉపాధి హామీ తెస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు ఉన్న పథకాన్నే తొలగించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఇది పథక స్ఫూర్తిని, ఆత్మను చంపే చర్యగా పేర్కొన్నారు. రాష్ట్రాలకు రావాల్సిన న్యాయబద్ధమైన నిధులను విడుదల చేయకుండా, సెస్‌ల పేరుతో కేంద్ర ప్రభుత్వం దోచుకుంటోందని ఆరోపించారు. ఖర్చుల్లో 40 శాతం భారం రాష్ట్రాలపై మోపుతూ ఫెడరల్ వ్యవస్థను బలహీనపరుస్తోందని అన్నారు. జీఎస్టీ కేంద్రీకరణతో రాష్ట్రాలకు స్వేచ్ఛ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫెడరల్ స్ఫూర్తిని చంపే ఈ ప్రయత్నాలను అడ్డుకుంటామని, అవసరమైతే ఉద్యమాలు చేస్తామని స్పష్టం చేశారు. పేదల పొట్టలు కొట్టే విధానాలను కాంగ్రెస్ పార్టీ సహించదన్నారు. పథకం పేరులో నుంచి గాంధీజీ పేరును తొలగించడం దుర్మార్గమని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే గాంధీ పేరుతో ఉపాధి హామీ పథకాన్ని తిరిగి తీసుకువచ్చి, పట్టణ ప్రాంతాలకు కూడా మరింత విస్తరిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.



సజావుగా 3వ విడత

# ఎన్నికలు

- డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో ఏర్పాట్లు బాగున్నాయ్
- అభినందించిన ఎలక్షన్ అబ్జర్వర్, జిల్లా ఎన్నికల అధికారి

2 లో





# ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలి

- డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో ఏర్పాట్లు బాగున్నాయ్
- అభినందించిన ఎలక్షన్ అబ్సర్వర్, జిల్లా ఎన్నికల అధికారి

**జనగామ, మన చౌరాస్తా :** గ్రామ పంచాయితీ ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించాలని ఎన్నికల పరిశీలకులు రవికిరణ్, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. నేడు జరిగే గ్రామ పంచాయితీ మూడో విడత ఎన్నికల సందర్భంగా.. పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండలాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని మంగళవారం ఎలక్షన్ అబ్సర్వర్ రవి కిరణ్, జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించారు. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో చేసిన ఏర్పాట్లు బాగున్నాయని ఎలక్షన్ అబ్సర్వర్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అధికారులను అభినందించారు. కార్యక్రమంలో డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఆర్డీఓలు, తహసీల్దార్ లు, ఎంపీడీఓ లు తదితరులు పాల్గొన్నారు.












# నిషేధాజ్ఞలు అమలు : సీపీ




**హనుమకొండ, మన చౌరాస్తా :** ఎన్నికల ప్రవర్తన నియమావళి 18వ తేది ఉదయం వరకు అమలు ఉంటుందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. మూడో విడత ఎన్నికల సందర్భంగా వరంగల్, హన్మకొండ, జనగామ జిల్లాల పరిధిలోని పోలింగ్ కేంద్రాల వద్ద రాష్ట్ర ఎన్నికల అధికారి ఉత్తర్వుల మేరకు 18 తేది ఉదయం 10 గంటల వరకు నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయన్నారు. ఈనెల 17న జరిగే మూడవ విడత పోలింగ్ నేపథ్యంలో, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటం నిషేధించినట్లు ఆయన పేర్కొన్నారు.

# మూడో విడత ఎన్నికలకు సర్వం సిద్ధం



**కొమురవెల్లి, మన చౌరాస్తా :** మూడో విడత పంచాయతీ ఎన్నికలు కొమురవెల్లి మండలం లోని 11 గ్రామాల్లో నేడు ఎన్నికలు జరగనున్నాయి. మండలంలోని మొత్తం ఓటర్లుగా 15821 వున్నారు అందులో పురుషులు 7786,మందిగా మహిళలు 8035 మంది ఉన్నారు.11గ్రామాల సర్పంచుల ఎన్నికల దిశ నిర్దేశం గురించి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కేంద్రాన్ని ఏర్పాటుచేసి, గ్రామాల వారిగా పోలింగ్ సామాగ్రిని అందజేశారు. జిల్లా కలెక్టర్ హైమావతి సందర్శించి తగు సూచనలు అందజేశారు. పోలింగ్ మెటీరియల్ తో పాటు, బ్యాలెట్ పేపర్, బ్యాలెట్ బాక్స్, ఓటర్ల లిస్టు, ఇతరత్రా సామాగ్రిని ఏర్పాటను క్షుణ్ణంగా పరిశీలించారు. ఓటర్లకు ఇబ్బంది కలవకుండా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ స్టేషన్, మరియు కౌంటర్ సెంటర్లలో ఏజెంట్లకు మరియు పోలింగ్ సిబ్బందికి ఎవరికి కూడా అనుమతి లేదని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో చంద్రకళ, సదానందం, ఎంపీడీవో లక్ష్మప్ప, తహసీల్దార్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.



# ఘనంగా ప్రారంభమైన ధనుర్మాస ఉత్సవాలు


**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :**

వీరభద్ర స్వామి సమేత భద్రకాళి దేవాలయంలో ధనుర్మాస ప్రారంభోత్సవం సందర్భంగా శైవ ఆగమ శాస్త్ర సాంప్రదాయాలకు అనుగుణంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 2026 జనవరిలో నిర్వహించనున్న స్వామివారి బ్రహ్మోత్సవాలను దృష్టిలో ఉంచుకుని, స్వామివారి లగ్నపత్రిక మరియు నెలకొల్పుట పూజలను ఆలయ ఆగమ విధానానుసారం చేపట్టారు. ఈ సందర్భంగా దేవాలయ కార్యనిర్వహణాధికారి పి. కిషన్ రావు ఆధ్వర్యంలో అర్చకుల సమన్వయంతో పుణ్యాహవచనం, గణపతి పూజ,వీరభద్ర స్వామి విశేష పూజ, భద్రకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కలశ పూజ, గౌరీ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. గౌరీ పూజలో భాగంగా శాలివాహనులచే నూతనంగా తయారుచేసిన మట్టి గురిగిలో బియ్యం, పూజా సామాగ్రి ఉంచి, అక్షింతలు, పూలు, దక్షిణ, తాంబూలాలతో అలంకరించారు. వేదమంత్రాల నడుమ మంగళ వాయిద్యాలతో ఈవో పి. కిషన్ రావు తలపై పూజా గురిగిని ఉంచుకొని ఆలయ ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం విఘ్నేశ్వరునికి, కాశీ విశ్వేశ్వర స్వామికి నమస్కరించి, శ్రీ వీరభద్ర స్వామి దర్శనం అనంతరం భద్రకాళి అమ్మవారి ఆలయంలో గర్భాలయంలో పూజా గురిగిని నెలకొల్పారు.

# మానకొండూర్ సర్పంచ్ బీఆర్ఎస్ కాదా?

### సర్పంచ్ గైర్హాజరు కావడంతో ఉత్కంఠ

**మానకొండూర్, మన చౌరాస్తా :** రాష్ట్రంలో ఇటీవల రెండో దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగిశాయి. ఈ నేపథ్యంలో గెలిచిన సర్పంచ్ అభ్యర్థులను ఆయా రాజకీయ పార్టీలు తమ పార్టీకి చెందినవారిగా ప్రకటిస్తూ సన్మాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లకు శాలువాలు కప్పి సన్మానం చేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పాల్గొన్నారు. అయితే బీఆర్ఎస్ పార్టీ తరపున ప్రచారం చేసి ఇటీవల గెలుపొందిన



మానకొండూర్ సర్పంచ్ తాళ్లపల్లి వర్షిణి గౌడ్ ఈ కార్యక్రమానికి హాజరుకాలేదు. దీంతో స్థానిక పార్టీ కార్యకర్తలు, ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మానకొండూర్ సర్పంచ్ నిజంగా బీఆర్ఎస్‌కు చెందినవారేనా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. సర్పంచ్ గైర్హాజరు కావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



# మాజీ సర్పంచ్ భర్తను కఠినంగా శిక్షించాలి

### ▪ దళిత సంఘాల నేతల డిమాండ్

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** బచ్చన్నపేట మండలం నాగిరెడ్డిపల్లి గ్రామంలో దళిత సామాజిక వర్గానికి చెందిన మహిళలపై జరిగిన కుల దౌర్జన్యం తీవ్ర ఆగ్రహానికి దారితీసింది. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ భర్త శశిధర్ రెడ్డి రాజకీయ కక్షతో విచక్షణ కోల్పోయి దళిత మహిళలను కించపరిచే విధంగా బహిరంగంగా అసభ్య పదజాలంతో దుర్భాషలాడినట్లు బాధితులు ఆరోపించారు. సర్పంచ్ ఎన్నికల సమయంలో టీఆర్ఎస్ తరఫున ప్రచారం చేయకుండా కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ప్రచారం చేసిన కళాకారులపై కక్షగట్టిన శశిధర్ రెడ్డి కాంగ్రెస్ వైపు ప్రచారం చేసిన కారణంగా కులం పేరుతో దూషించాడని బాధితులు సంధ్య, అనిత, రజిత, సప్న పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు తమ గౌరవాన్ని తీవ్రంగా దెబ్బతీశాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పల్లా నీలిమ ఆసుపత్రిలో చికిత్స పొందిన కళాకారులు కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ప్రచారం చేయడాన్ని జీర్ణించుకోలేకే ఈ దౌర్జన్యానికి పాల్పడ్డాడని బాధితులు తెలిపారు. రాజకీయ అభిప్రాయాల పేరుతో దళిత మహిళలను అవమానించడం రాజ్యాంగ విలువలకు విరుద్ధమని గ్రామస్తులు మండిపడ్డారు.ఈ ఘటనపై గ్రామంలోని దళిత సంఘాలు, ప్రజాసంఘాలు తీవ్రంగా స్పందించాయి. దళిత మహిళల గౌరవానికి భంగం కలిగించిన శశిధర్ రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ (అట్రాసిటీ) చట్టంతో పాటు సంబంధిత క్రిమినల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. బాధితులకు తక్షణ న్యాయం చేయకపోతే నిరసనలు, ఆందోళనలకు దిగుతామని గ్రామస్తులు హెచ్చరించారు.



# భక్తిశ్రద్ధలతో చాలీసా పారాయణం

**జనగామ, మన చౌరాస్తా : జనగామ భక్త బృందం ఆధ్వర్యంలో ఉప్పలమ్మ సహిత భక్తాంజనేయ దేవాలయంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం, చందన, పత్రపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనగామలో ప్రతి మంగళవారం రోజు ఒక్కొక్క దేవాలయంలో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించాలని సంకల్పించామని, వీలైన మహిళలు వచ్చి పారాయణంలో పాల్గొనాలని కోరారు.**



# పాలకుర్తిలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

పాలకుర్తి, మన చౌరాస్తా : గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా మండలంలోని ప్రజలందరూ భయభ్రాంతులకు గురి కాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని పోలీసులు తెలిపారు. పాలకుర్తి మండలంలోని బమ్మెర, గూడూరు, తిరుమలగిరి, అయ్యంగారిపల్లి, వావిలాల, పాలకుర్తి గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రజల్లో ఉన్న భయాలను తొలగించి స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ప్రజలలో భరోసాను కల్పించడం కోసం ఈ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామనీ డీసీపీ రాజమహేంద్ర నాయక్ తెలిపారు. ఏసీపి బీమ్ శర్మ, సీఐ జానకిరామ్ రెడ్డి, ఎస్ఐ పవన్ కుమార్ ఎన్నికల బందోబస్తుకు వచ్చిన పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





# కాంగ్రెస్ ఇన్‌చార్జిని కలిసిన నూతన సర్పంచులు

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** బచ్చన్నపేట మండలంలోని బండ నాగారం గ్రామ నూతన సర్పంచ్ ఇజ్జగిరి రాములు ఆధ్వర్యంలో మండలంలోని నూతనంగా ఎన్నికైన సర్పంచులు జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామాల అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు చేరవేయడంపై చర్చించారు. గ్రామంలో దుర్గామాత గుడి నిర్మాణం పూర్తి చేసి పండుగ చేస్తానని ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటా అని తెలియజేశారు. గ్రామంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు, పెన్షన్ సౌకర్యం కల్పిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో బత్తిని రాములు, ఇజ్జగిరి కరుణాకర్, శివరాత్రి సురేష్, ఇజ్జగిరి దశరథ, జంగిలి స్వామి, మానేపలి భిక్షపతి, యాదగిరి, గండి సురేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** మండలంలోని తాటికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తాటికొండలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు హోప్ ఫర్ లైఫ్ స్వచ్ఛంద సంస్థ విజిఎస్ స్టడీ మెటీరియల్ అందజేశారని ప్రధానోపాధ్యాయులు పెనుమాటి వెంకటేశ్వర్లు తెలిపారు . సంస్థకు చెందిన బంధం లింగారెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా సంస్థ ప్రతినిధి పల్లె రాజిరెడ్డి ద్వారా ఈ మెటీరియల్ విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పెనుమాటి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, అనసూయ, కృపమ్మ, సోమేశ్వరి, జగదీష్, రవి, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.



## నా పెళ్లిపై అసత్య ప్రచారలెందుకు?

### నటి మెహరిన్ ఘాటు వ్యాఖ్యలు

తన పెళ్లి వార్తలపై అసత్య కథనాలపై నటి మెహరిన్ తీవ్రంగా స్పందించారు. తన పెళ్లంటూ ఆర్టికల్ రాసిన ఓ మీడియా సంస్థపై నటి మెహరీన్ అసహనం వ్యక్తంచేశారు. గత రెండేళ్లుగా ఇలాంటి వ్యవహారాలపై మౌనంగా ఉన్నా, ఇప్పుడు మాట్లాడక తప్పడం లేదన్నారు. నేను ఎవరినీ వివాహం చేసుకోలేదు. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నప్పుడు ప్రపంచానికి చెబుతా.. అంతేగానీ తన పెళ్లి గురించి వదంతులు వ్యాప్తి చేయొద్దని కోరారు. హరియాణాకు చెందిన భవ్యా బిష్ణోయ్‌తో మెహరీన్ నిశ్చితార్థం జరిగినా అనివార్య కారణాల వల్ల పెళ్లి రద్దు అయింది. 2022లో వచ్చిన 'ఎఫ్ 3' తర్వాత ఆమె నటించిన తెలుగు సినిమా 'స్పార్క్'. కోలీవుడ్‌లోనూ ఒక్క సినిమాలోనే (ఇంద్ర) నటించారు. ప్రస్తుతం కన్నడలో ఓ చిత్రం చేస్తున్నారు. కెరీర్‌లో గ్యాప్‌పై ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. గ్యాప్ కావాలని తీసుకోలేదని, 'ఎఫ్ 3' తర్వాత చేసిన 'సుల్తాన్ ఆఫ్ దిల్లీ' వెబ్‌సిరీస్ కోసం ఎక్కువ సమయం కేటాయించానని తెలిపారు.



Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**